# మార్కుల కన్నా లక్ష్యం ముఖ్యం



## ఇంటర్ తర్వాత కెరీర్ ఎంపికలో జాగ్రత్త

### ఇంజినీరింగ్, మెడికల్ ప్రవేశాలపై స్పష్టత అవసరం.. విద్యార్థులు, తల్లిదండ్రులకు నిపుణుల సూచనలు

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సారి ఇంటర్ పరీక్షలు వచ్చే నెల లోనే ప్రారంభం కానున్నాయి, దీంతో ఇంజినీరింగ్, మెడికల్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే ఎంట్రన్స్ పరీక్షలపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆసక్తి పెరుగుతోంది. భవిష్యత్ కెరీర్‌ను దృష్టిలో ఉంచుకుని సరైన కోర్సు ఎంపిక, తగిన ఎంట్రన్స్ పరీక్షలపై స్పష్టమైన అవగాహన అవసరమని విద్యా నిపుణులు సూచిస్తున్నారు.

ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ (మ్యాథ్స్-ఫిజిక్స్-కెమిస్ట్రీ) పూర్తి చేసిన విద్యార్థులు ప్రధానంగా ఇంజినీరింగ్ కోర్సుల వైపు అడుగులు వేస్తుండగా, బైపీసీ (బోటనీ-జూలజీ-ఫిజిక్స్-కెమిస్ట్రీ) పూర్తి చేసిన విద్యార్థులు మెడికల్ రంగాన్ని ఎంచుకుంటున్నారు. పీసీఎంబీ చదివిన విద్యార్థులకు ఇంజినీరింగ్, మెడికల్ రెండింటికీ అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

ఇంజినీరింగ్ ప్రవేశాల కోసం జాతీయ, రాష్ట్ర స్థాయిలో పలు ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహించబడుతున్నాయి. జాతీయ స్థాయిలో జేఈఈ మెయిన్ ద్వారా ఎన్ఐటీలు, ఐఐఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలు లభిస్తాయి. జేఈఈ అడ్వాన్స్‌డ్ ద్వారా ఐఐటీల్లో సీట్లు పొందే అవకాశం ఉంటుంది. అలాగే బిట్సాట్ ద్వారా బిట్స్ పిలానీ, గోవా, హైదరాబాద్ క్యాంపసుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. వీటితో పాటు విఐటీఈఈఈ, ఎస్ఆర్ఎంజేఈఈ వంటి యూనివర్సిటీ స్థాయి పరీక్షల ద్వారా ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో సీట్లు లభిస్తాయి.

రాష్ట్ర స్థాయిలో తెలంగాణలో టీఎస్ ఈఏపీసెట్, ఆంధ్రప్రదేశ్‌లో ఏపీ ఈఏపీసెట్ ద్వారా ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. కర్ణాటకలో కెసెట్, మహారాష్ట్రలో ఎంహెచ్‌సెట్ వంటి పరీక్షలు కూడా నిర్వహించబడుతున్నాయి.

ఇక మెడికల్ రంగంలో ప్రవేశానికి దేశవ్యాప్తంగా ఒకే ఒక్క పరీక్షగా నీట్ యూజీని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. నీట్ ద్వారా ఎంబీబీఎస్, బీడీఎస్‌తో పాటు ఆయుష్ కోర్సులు అయిన బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, బీయూఎంఎస్, వెటర్నరీ, కొన్ని నర్సింగ్ కోర్సుల్లో కూడా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రస్తుతం మెడికల్ కోర్సుల్లో చేరాలంటే నీట్ అర్హత తప్పనిసరిగా మారింది.

విద్యార్థులు తమ ఆసక్తి, సామర్థ్యాలను గుర్తించి కోర్సు ఎంపిక చేసుకోవాలని, గుడ్డిగా ఇతరులను అనుసరించకుండా దీర్ఘకాల లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలని విద్యావేత్తలు



సూచిస్తున్నారు. ఎంట్రన్స్ పరీక్షల కోసం ముందస్తు ప్రణాళిక, క్రమబద్ధమైన అధ్యయనం అవసరమని, ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం నుంచే సన్నద్ధత ప్రారంభిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని వారు చెబుతున్నారు.

ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలపై అనవసర ఒత్తిడి తేవకుండా వారి అభిరుచులకు అనుగుణంగా ప్రోత్సహించాలని, విద్యార్థులు కూడా సరైన సమాచారం సేకరించి ఆలోచనాత్మక నిర్ణయాలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

#### ఇంజినీరింగ్ ప్రవేశాలు

- ఎంపీసీ (గణితం-భౌతిక శాస్త్రం-రసాయన శాస్త్రం) విద్యార్థులకు ప్రధాన మార్గాలు:

#### జాతీయ స్థాయి పరీక్షలు:

- జేఈఈ మెయిన్: ఎన్ఐటీలు, ఐఐఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలు.
- జేఈఈ అడ్వాన్స్: ఐఐటీలలో ప్రవేశాలకు ఏకైక మార్గం.
- బిట్సాట్: బిట్స్ పిలానీ, గోవా, హైదరాబాద్ క్యాంపస్‌లలో ప్రవేశాలు.
- వీఐటీఈఈఈ, ఎస్ఆర్ఎంజేఈఈఈ: ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలకు ఉపయోగపడతాయి.

#### రాష్ట్ర స్థాయి పరీక్షలు:

- టీఎస్ ఈఏపీసెట్: తెలంగాణ రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలలు.
- ఏపీ ఈఏపీసెట్: ఆంధ్రప్రదేశ్‌లోని ఇంజినీరింగ్ కళాశాలలు.
- కేసీఈటీ: కర్ణాటక రాష్ట్రం.
- ఎంహెచ్‌సీఈటీ: మహారాష్ట్ర రాష్ట్రం.

#### మెడికల్ ప్రవేశాలు

- బైపీసీ (వృక్షశాస్త్రం-జంతుశాస్త్రం-భౌతిక శాస్త్రం-రసాయన శాస్త్రం) విద్యార్థులకు ప్రధాన మార్గం:
- నీట్ యూజీ: దేశవ్యాప్తంగా మెడికల్ ప్రవేశాలకు ఒకే పరీక్ష.
- దీని ద్వారా ఎంబీబీఎస్, బీడీఎస్‌తో పాటు ఆయుష్ కోర్సులు (బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, బీయూఎంఎస్), వెటర్నరీ, నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలు లభిస్తాయి. ప్రస్తుతం నీట్ అర్హత తప్పనిసరిగా అమలులో ఉంది.

#### పీసీఎంబీ విద్యార్థులకు అవకాశాలు

గణితం, జీవశాస్త్రం రెండూ చదివిన పీసీఎంబీ విద్యార్థులు ఇంజినీరింగ్‌తో పాటు మెడికల్ రంగానికీ అర్హులు. వ్యక్తిగత ఆసక్తి, సామర్థ్య, దీర్ఘకాల లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని సరైన మార్గాన్ని ఎంపిక చేసుకోవచ్చు.

#### నిపుణుల సూచనలు

- ఆసక్తి, సామర్థ్యానికి అనుగుణంగా కోర్సును ఎంపిక చేయాలి.
- దీర్ఘకాల లక్ష్యాన్ని ముందుగానే నిర్ణయించుకోవాలి.
- ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం నుంచే సన్నద్ధత ప్రారంభిస్తే మెరుగైన ఫలితాలు సాధ్యం.
- తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి చేయకుండా ప్రోత్సహించాలి.
- విద్యార్థులు సరైన సమాచారం సేకరించి ఆలోచనాత్మక నిర్ణయం తీసుకోవాలి.

యాంసాని శివ కుమార్
ఎడిటర్/భౌతిక శాస్త్ర అధ్యాపకులు



ఇంటర్మీడియట్ తర్వాత ఎంట్రన్స్ పరీక్షల ఎంపిక జీవన దిశను మలుపు తిప్పే నిర్ణయం. ఇంజినీరింగ్, మెడికల్ రంగాల్లో అవకాశాలు విస్తృతంగా ఉన్నప్పటికీ, వ్యక్తిగత ఆసక్తి, సామర్థ్య, దీర్ఘకాల లక్ష్యాల ఆధారంగా నిర్ణయం తీసుకోవడమే విజయానికి మార్గమని విద్యా నిపుణులు సూచిస్తున్నారు.

# నీట్ మాత్రమే కాదు

### బైపీసీ విద్యార్థులకు ఆల్ ఇండియా స్థాయిలో విస్తృత కెరీర్ అవకాశాలు



మెడికల్‌తో పాటు నర్సింగ్, రీసెర్చ్, లైఫ్ సైన్సెస్, అగ్రికల్చర్ రంగాల్లో మార్గాలు

ఇంటర్మీడియట్ బైపీసీ పూర్తిచేసిన విద్యార్థులకు మెడికల్ రంగంలో ప్రవేశానికి నీట్ ఒక్కటే మార్గమనే అభిప్రాయం చాలామందిలో ఉన్నప్పటికీ, నీట్‌కు అతీతంగా కూడా ఆల్ ఇండియా స్థాయిలో పలు ఎంట్రన్స్ పరీక్షలు, విభిన్న కెరీర్ అవకాశాలు అందుబాటులో ఉన్నాయని విద్యా నిపుణులు వెల్లడిస్తున్నారు.

ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశానికి నీట్ అర్హత తప్పనిసరి అయినప్పటికీ, నర్సింగ్, రీసెర్చ్, లైఫ్ సైన్సెస్, అగ్రికల్చర్, పారామెడికల్ రంగాల్లో వేర్వేరు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల ద్వారా అవకాశాలు లభిస్తున్నాయి.

కేంద్ర ప్రభుత్వ వైద్య విద్యా సంస్థ Jawaharlal Institute of Postgraduate Medical Education & Research (JIPMER)లో బీఎస్సీ నర్సింగ్ కోర్సుకు ప్రత్యేక ఎంట్రన్స్ పరీక్ష ద్వారా ప్రవేశాలు కల్పిస్తున్నారు. ఈ కోర్సుకు నీట్ అవసరం లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. అలాగే ఏఐఐఎంఎస్ వంటి కేంద్ర సంస్థల్లో కూడా నర్సింగ్, పారామెడికల్ కోర్సులకు వేర్వేరు ప్రవేశ విధానాలు ఉన్నాయి.

శాస్త్రీయ పరిశోధనలపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు *Indian Institutes of Science Education and Research (IISER)లలో ఐఐఎస్ఈఆర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ద్వారా ఇంటిగ్రేటెడ్ బీఎస్-ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశాలు లభిస్తాయి. అలాగే **National Institute of Science Education and Research (NISER)లో నెస్ట్ పరీక్ష ద్వారా ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ కోర్సుకు అవకాశాలు ఉన్నాయి. ఈ కోర్సులు శాస్త్రవేత్త, పరిశోధకులుగా ఎదగడానికి బలమైన పునాది వేస్తాయని నిపుణులు చెబుతున్నారు.

వ్యవసాయ రంగంలో ఆసక్తి ఉన్న విద్యార్థులకు Indian Council of Agricultural Research (ICAR) ఆధ్వర్యంలో నిర్వహించే ఆల్ ఇండియా ఎంట్రన్స్ ద్వారా బీఎస్సీ అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫిషరీస్, ఫారెస్ట్రీ వంటి కోర్సుల్లో ప్రవేశాలు లభిస్తాయి. అలాగే కేంద్ర విశ్వవిద్యాలయాల్లో బయాలజీ, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, మైక్రోబయాలజీ వంటి కోర్సులకు సీయూఈటీ ద్వారా అవకాశాలు ఉన్నాయి.

విద్యార్థులు నీట్ ఒక్కటినే లక్ష్యంగా పెట్టుకుని నిరాశ చెందకుండా, తమ ఆసక్తి, సామర్థ్యాన్ని బట్టి ప్రత్యామ్నాయ కెరీర్ మార్గాలను కూడా పరిశీలించాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. నర్సింగ్, రీసెర్చ్, లైఫ్ సైన్సెస్, అగ్రికల్చర్ రంగాల్లో కూడా స్థిరమైన భవిష్యత్ ఉందని, ముందుగానే సరైన సమాచారంతో ప్రణాళిక రూపొందించుకుంటే అవకాశాలు విస్తృతంగా ఉంటాయని వారు పేర్కొంటున్నారు.

తల్లిదండ్రులు కూడా పిల్లలపై ఒకే లక్ష్యాన్ని బలవంతంగా మోపకుండా, వివిధ కెరీర్ మార్గాలపై అవగాహన కల్పించి ప్రోత్సహించాలని నిపుణులు సూచిస్తున్నారు. సరైన మార్గదర్శకంతో ముందుకెళ్తే బైపీసీ విద్యార్థులకు నీట్‌కు అతీతంగా కూడా ఎన్నో విజయ ద్వారాలు తెరుచుకుంటాయని వారు అభిప్రాయపడుతున్నారు.



# జోసా కౌన్సెలింగ్ 2026

## పూర్తి వివరాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీలు), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీలు), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీలు), ఐఐఈఎస్టీ, ప్రభుత్వ ఫండెడ్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌ల (జీఎఫ్‌టీఐలు)లో ప్రవేశాల కోసం నిర్వహించే జాయింట్ సీట్ అలోకేషన్ అథారిటీ (JoSAA) కౌన్సెలింగ్ 2026పై స్పష్టత వచ్చింది. ఈ కౌన్సెలింగ్ ద్వారా విద్యార్థులు వేర్వేరు సంస్థలకు విడిగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేకుండా ఒకే ప్రక్రియలో సీట్లు పొందే అవకాశం ఉంటుంది.

#### జోసా (JoSAA) అంటే ఏమిటి?

జోసా అనేది కేంద్ర స్థాయి సంస్థ. ఇది ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఐటీలు, ఐఐఈఎస్టీ, జీఎఫ్‌టీఐలలో సీట్ల కేటాయింపును నిర్వహిస్తుంది. ఒకే కౌన్సెలింగ్ విధానం ద్వారా పారదర్శకంగా సీట్లను కేటాయించడం దీని లక్ష్యం.

#### అర్హత నిబంధనలు

ఐఐటీలకు: జేఈఈ అడ్వాన్స్ ర్యాంక్ ఆధారంగా ప్రవేశాలు. ఎన్ఐటీలు, ఐఐఐటీలు, ఐఐఈఎస్టీ, జీఎఫ్‌టీఐలకు: జేఈఈ మెయిన్ ర్యాంక్ ఆధారంగా ప్రవేశాలు. ఇంటర్/12వ తరగతిలో జనరల్, ఓబీసీ విద్యార్థులకు కనీసం 75 శాతం, ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు 65 శాతం మార్కులు ఉండాలి.

#### కౌన్సెలింగ్ షెడ్యూల్ (2026)

నమోదు, ఆప్షన్ ఫిల్లింగ్: జూన్ 2, 2026 నుంచి ప్రారంభం.

మొత్తం రౌండ్లు: ఆరు రౌండ్లు నిర్వహించే అవకాశం ఉంది.

ప్రతి రౌండ్‌లో సీటు కేటాయింపు, సీటు అంగీకారం, ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ల ధృవీకరణ జరుగుతుంది.

జోసా పూర్తయ్యాక మిగిలిన ఎన్ఐటీ, జీఎఫ్‌టీఐ సీట్లను సీఎస్ఏబీ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తారు.

#### అవసరమైన పత్రాలు

జేఈఈ మెయిన్/అడ్వాన్స్ అడ్మిట్ కార్డు, ర్యాంక్ కార్డు
10వ, 12వ తరగతి మార్కుల జాబితాలు
కేటగిరీ సర్టిఫికెట్ (వర్తిస్తే)
పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు
గుర్తింపు పత్రం (ఆధార్, పాస్‌పోర్ట్ మొదలైనవి)

#### సీటు కేటాయింపు విధానం

విద్యార్థులు josaa వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని కాలేజీలు, బ్రాంచ్‌లను ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేయాలి. ర్యాంక్, కేటగిరీ, సీట్ల లభ్యత ఆధారంగా సీటు కేటాయింపు జరుగుతుంది.

విద్యార్థులు మూడు ఎంపికల్లో ఏదైనా ఎంచుకోవచ్చు:
ఫ్రీజ్: కేటాయించిన సీటును పూర్తిగా అంగీకరించడం.
ఫ్లోట్: సీటును అంగీకరిస్తూనే తదుపరి రౌండ్లలో మెరుగైన కాలేజీకి అవకాశం కోరడం.
స్లైడ్: అదే కాలేజీలో ఉన్నత బ్రాంచ్‌కు మారేందుకు అవకాశం.

#### ముఖ్య సూచనలు

ఐఐటీలు, ఎన్ఐటీలు తదితరాలకు వేర్వేరు కౌన్సెలింగ్‌లు ఉండవు. జోసానే ఏకైక మార్గం.

ఆప్షన్ ఫిల్లింగ్‌లో జాగ్రత్త అవసరం. ప్రాధాన్యత క్రమమే తుది సీటును నిర్ణయిస్తుంది.

గడువులు తప్పితే సీటు రద్దయ్యే ప్రమాదం ఉంది.

జోసా కౌన్సెలింగ్ 2026 ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఐటీలు, జీఎఫ్‌టీఐలలో ప్రవేశాలకు ప్రధాన ద్వారం. జూన్ 2026లో ప్రారంభమయ్యే ఈ ప్రక్రియలో సరైన ఆప్షన్ ఫిల్లింగ్, సమయానికి ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ ధృవీకరణ అత్యంత కీలకం. ఒక చిన్న తప్పిదం కూడా సీటును కోల్పోయే పరిస్థితిని తీసుకురాగలదని నిపుణులు సూచిస్తున్నారు.

# యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

ఎమ్మెల్యే డా: కవ్వంపల్లి సత్యనారాయణ.





జనత న్యూస్ బెజ్జంకి : మండల కేంద్రంలో నిర్వహిస్తున్నటువంటి 48వ ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్ పోటీలను మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదివారం స్థానిక సర్పంచ్ బొల్లం శ్రీధర్ ( పెద్దన్న)తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు దేహదారుధ్యాన్ని పెంచడమే కాకుండా, వ్యూహాత్మకంగా ఆలోచించే శక్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ రోజుల్లో విద్యార్థులు, యువకులు సెల్ఫోన్లను పట్టుకొని సమయాన్ని వృధా చేసుకుంటున్నారని, సమయం సద్వినియోగం చేసుకోవడానికి క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుంటూ , మానసిక వికాసంతో యువత అనుకున్న ఆశయాలను చేరుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కవ్వంపల్లి అనురాధ, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ చిలివేరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, మండల పార్టీ అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, టెంపుల్ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కర వేణి పోచయ్య, కాంగ్రెస్ నాయకులు భైర సంతోష్, పోతిరెడ్డి మధు- సూదన్ రెడ్డి, పర్శ సంతోష్, జేరిపోతుల మధు ,లింగాల శ్రీనివాస్,మచ్చ కుమార్, కర్రావుల సందీప్, వడ్లకొండ శ్యామ్,బోనగం రమేష్ గౌడ్, ఎర్రల రాజు, పిట్టల అరుణ్, బోయిని ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# 13న కరీంనగర్‌కు వెలిచాల రాజేందర్ రావు

**అలుగునూరు చౌరస్తా నుంచి భారీ ర్యాలీ**

**ఘన స్వాగతానికి ఏర్పాట్లు**

కరీంనగర్: జనత న్యూస్: కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఇటీవల నియమితులైన వెలిచాల రాజేందర్ రావు ఈ నెల 13వ తేదీ మంగళవారం తొలిసారిగా కరీంనగర్‌కు రానున్నారు. ఈ సందర్భంగా అలుగునూరు చౌరస్తా నుంచి గీత భవన్ చౌరస్తా వరకు భారీ ర్యాలీతో ఘన స్వాగతం పలకేందుకు కాంగ్రెస్ శ్రేణులు విస్తృత ఏర్పాట్లు చేశాయి. మంగళవారం ఉదయం 11 గంటలకు అలుగునూరు చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, సర్పంచులు, అనుబంధ సంఘాల నాయకులు, అభిమానులు రాజేందర్ రావుకు ఘన స్వాగతం పలకనున్నారు. అనంతరం అక్కడి నుంచి భారీ ర్యాలీగా గీత భవన్ చౌరస్తా వరకు చేరుకుని సంబురాల్లో పాల్గొననున్నారు. అనంతరం మధ్యాహ్నం 1 గంటలకు డీసీసీ కార్యాలయంలో వెలిచాల రాజేందర్ రావు ప్రెస్ మీట్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రంథలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, కాంగ్రెస్ నేత ఆల్ ఫోర్స్ నరేందర్ రెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్తో పాటు మాజీ ఎమ్మెల్యేలు, నామినేటెడ్ పదవుల్లోని నాయకులు, రాష్ట్ర--జిల్లా స్థాయి నేతలు పాల్గొననున్నారు. అలాగే బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని వెలిచాల ప్రజా కార్యాలయం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

# జీవాత్మలోనే దైవాత్మ.. పేదవారికి సేవే నిజమైన పూజ

**నీఫా రాష్ట్ర సెక్రెటరీ, మాజీ కార్పొరేటర్ కోలగాని శ్రీనివాస్**



కరీంనగర్: జనత న్యూస్:యువతకు ప్రేరణగా, భారతదేశ సాంస్కృతిక సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద 163వ జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా తీగలగుట్టపల్లి 2వ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం నీఫా రాష్ట్ర సెక్రెటరీ, మాజీ కార్పొరేటర్ కోలగాని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నీఫా రాష్ట్ర బాధ్యులు, ఎన్వైపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గొల్లె తిరుపతి, ఎన్వైపీ రాష్ట్ర అధ్యక్షుడు యాదవ రాజు తదితరులు పాల్గొని స్వామి వివేకానందతో పాటు నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటాలకు పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా కోలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, "మానవసేవయే మాధవ సేవ. దేవుణ్ని చూడాలంటే పేదవారి హృదయంలో చూడాలి. పేదవారికి సేవ చేస్తే అదే దేవునికి చేసిన పూజ" అని అన్నారు. గుడిలో పూజలకన్నా గుడిమెట్ల ముందు సహాయం కోరే నిరుపేదలకు చేయూతనివ్వడమే నిజమైన భక్తి అని తెలిపారు. గత 25 సంవత్సరాలుగా జాతి సమైక్యత, మతసామరస్యం, శాంతి--సద్భావన, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో తాను పాల్గొం టున్నానని పేర్కొన్నారు. ఇటీవల కామారెడ్డిలో జరిగిన వరదల సమయంలో బాధితులకు సహాయం అందిం చామని తెలిపారు. అనంతరం గొల్లె తిరుపతి మాట్లాడు తూ, నీఫా ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు సహా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇవన్నీ స్వామి వివేకానంద ఇచ్చిన స్ఫూర్తితోనే కొనసాగుతు న్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నీఫా, ఎన్వైపీ నాయకులు, యువత, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దోపిడీ రహిత సమాజమే సీపీఐ లక్ష్యం

**సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్**

**హుస్నాబాద్‌లో జనసేవా దళ్ శిక్షణ శిబిరాలు ప్రారంభం**



హుస్నాబాద్, జనత న్యూస్: దేశంలో దోపిడీ లేని వ్యవస్థను, ఆర్థిక అసమానతలు లేని సమసమాజాన్ని నిర్మించడమే భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్ స్పష్టం చేశారు. ఆదివారం హుస్నాబాద్ పట్టణంలో నిర్వహించిన జిల్లా స్థాయి జనసేవా దళ్ శిక్షణ శిబిరాలను ఆయన ప్రారంభించారు. తొలుత పార్టీ అరుణ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. నేటి తరం యువత శారీరక దృఢత్వంతో పాటు మానసిక పరివర్తనను అలవరుచుకోవాలని, సమాజం పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు.మారుతున్న కాలానికి అనుగుణంగా రాజకీయ, సైద్ధాంతిక అంశాలపై కార్యకర్తలు పట్టు సాధించాలని సూచించారు.భారత గడ్డపై వందేళ్ల త్యాగాల చరిత్ర కలిగిన సీపీఐ శత జయంతి ఉత్సవాల ముగింపు సభలను ఈనెల 18న ఖమ్మం జిల్లా కేంద్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు మల్లేశ్ వెల్లడించారు. ఈ భారీ బహిరంగ సభకు సుమారు 40 దేశాల ప్రతినిధులతో పాటు 5 లక్షల మంది కమ్యూనిస్టు కార్యకర్తలు హాజరుకానున్నారని తెలిపారు. ఈ వేదికపైనే దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చించి, భవిష్యత్తులో చేపట్టబోయే పోరాట కార్యాచరణను ఖరారు చేస్తామని వివరించారు.ఈ కార్యక్రమంలో జనసేవా దళ్ రాష్ట్ర ఇన్‌స్ట్రక్టర్ గోసిక మోహన్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కనుకుంట్ల శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు జాగిరి సత్యనారాయణ గౌడ్, కిష్టపురం లక్ష్మణ్, అందె అశోక్, జేరిపోతుల జనార్దన్, కోహెడ, బెజ్జంకి మండల కార్యదర్శు లు వేల్పుల శ్రీనివాస్, బోనగిరి రూపేష్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు జనగాం రాజకుమార్, రామగాళ్ల నరేష్, చిట్యాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# బెజ్జంకి మండలం కరీంనగర్‌లో కలుస్తుంది

మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ.



జనత న్యూస్ బెజ్జంకి : బెజ్జంకి మండల ప్రజల అభిష్టాన్ని , ఎన్నికల హామీలో ఇచ్చిన మాటను నిలబెట్టుకొని బెజ్జంకి మండలాన్ని తిరిగి కరీంనగర్ జిల్లాలో కలపడానికి కట్టుబడి ఉన్నానని మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మండల కేంద్రంలో నిర్వహిస్తున్నటువంటి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంలో కరీంనగర్ జిల్లా పోరాట సమితి సభ్యులు మానాల రవి, దోనే వెంకటేశ్వరరావు లు మండల సాధన సమితి సభ్యులతో కలిసి బెజ్జంకి మండల ప్రజల కోరికను మెమోరాండం రూపంలో అందించిన సందర్భంలో వారికి ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో జిల్లా పోరాట సమితి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న బేగంపేట్ ఉపసర్పంచ్



జనత న్యూస్ బెజ్జంకి: మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన క్రికెట్ క్రీడాకారులకు ఆదివారం మండల కేంద్రంలో గ్రామ ఉపసర్పంచ్ పోతిరెడ్డి మధుసూదన్ రెడ్డి క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో 11 వేల రూపాయల విలువ కలిగిన క్రికెట్ బ్యాట్ ను మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ల చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బైర సంతోష్, అన్నాజీ( చిన్న) వెంకటేష్ బేగంపేట్ క్రికెట్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గాగిల్లాపూర్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలు



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని గాగిల్లాపూర్ గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని గ్రామంలోని మహిళలకు ముగ్గుల పోటీలను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ముగ్గుల పోటీలో గెలుపొందిన విజేతలకు ఆదివారం గ్రామ సర్పంచ్ ఎర్రల జానకి రాజు లు బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చింతలపల్లి పద్మ, వార్డు మెంబర్లు, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

# టీచర్స్ కాలనీలో అంగరంగ వైభవంగా ముగ్గుల పోటీలు



హుస్నాబాద్, జనత న్యూస్:సంక్రాంతి పండుగను పురస్కరించుకుని హుస్నాబాద్ పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆకుల రజిత వెంకన్న, మాజీ వైస్ చైర్మన్ అయిలేని అనిత శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగువారి సంస్కృతికి, సంప్రదాయాలకు సంక్రాంతి ముగ్గులు ప్రతీకలని కొనియాడారు. ఇంటి ముందు రంగురంగుల ముగ్గులు వేయడం వల్ల ఇల్లు కళకళలాడుతుందని, ఇది మహిళల సృజనాత్మకతకు నిదర్శనమని పేర్కొన్నారు. పోటీల్లో గెలుపోటములు సహజమని, పండుగ వేళ అందరూ కలిసికట్టుగా ఇలాంటి పోటీల్లో పాల్గొనడం అభినందనీయమని వారు తెలిపారు. ఓడిపోయిన వారు నిరుత్సాహపడకుండా, మున్ముందు మరిన్ని మెళకువలతో రాణించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, కాలనీ వాసులు అయిలేని మల్లికార్జున రెడ్డి, సావుల రవీందర్, ఆత్మలింగం, గోవింద రవి, పూదరి సంపత్, మల్లేశం, తిరుపతి, లక్ష్మణ్, వికాస్, కనుకయ్య తదితరులు పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

## ఘనంగా వడ్డే ఓబన్న జయంతి



కరీంనగర్: జనత న్యూస్: రేనాటి స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలు జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ ఆర్డీఓ మహేశ్వర్ వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆర్డీఓ మహేశ్వర్ మాట్లాడుతూ, వడ్డే ఓబన్న బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో సాయుధంగా పాల్గొని వీరోచితంగా పోరాడిన యోధుడని పేర్కొన్నారు. ఆంగ్లేయ ప్రభుత్వానికి ఎదురొడ్డి నిలిచిన ప్రముఖ స్వాతంత్ర సమరయోధుల్లో వడ్డే ఓబన్న ఒకరని అన్నారు. ఆయన వడ్డెర కులానికే కాకుండా దేశ ప్రజలందరినీ బానిస సంకెళ్ల నుంచి విముక్తి చేయాలనే లక్ష్యంతో పోరాడిన మహనీయుడని కొనియాడారు. అటువంటి గొప్ప వ్యక్తి జయంతిని అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ అభివృద్ధి శాఖ అధికారి ఎం. అనిల్ ప్రకాష్, జిల్లా వడ్డెర సంఘం ప్రతినిధులు బి. సమ్మయ్య, సిహెచ్. రాజ్‌కుమార్, సిహెచ్. పద్మ, ఓ. రమేష్, ఎస్. ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల ప్రత్యేక అధికారులు, వసతి గృహ వార్డెన్లకు ఐదు రోజుల శిక్షణ ముగింపు



కరీంనగర్: జనత న్యూస్: కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీకి చెందిన జాతీయ విద్యా ప్రణాళిక మరియు పరిపాలనా సంస్థ సహకారంతో కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల ప్రత్యేక అధికారులు, వసతి గృహ వార్డెన్లకు కలెక్టరేట్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో నిర్వహించిన ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం శనివారం విజయవంతంగా ముగిసింది. శిక్షణలో పొందిన అంశాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల బాలిక విద్యార్థులను విద్యతో పాటు అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రత్యేక అధికారులు, వార్డెన్లపై ఉందని శిక్షణ నోడల్ అధికారి కృపారాణి తెలిపారు. బాలికలను కేవలం విద్యావంతులుగానే కాకుండా, స్వయం ఉపాధి సాధించేలా, ఆత్మవిశ్వాసంతో తమ కాళ్లపై తాము నిలబడే విధంగా తీర్చిదిద్దాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా శిక్షణార్థులకు బ్యాగులను బహుమతిగా అందజేసి, శిక్షణ పూర్తి చేసిన వార్డెన్లు, ప్రత్యేక అధికారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శిక్షణ అధికారి డాక్టర్ దేబోర కృపారాణి, యాదాద్రి భువనగిరి జిల్లా మాస్టర్ శిక్షకురాలు నిర్మల జ్యోతి, జిల్లా యువజన అధికారి రాంబాబు, శిక్షకుడు మరియు వనరుల వ్యక్తి సంతోష్ కుమార్ పాల్గొన్నారు. అలాగే కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు చెందిన కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల ప్రత్యేక అధికారులు, వసతి గృహ వార్డెన్లు హాజరయ్యారు.

## బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో కీలక సమావేశం

కరీంనగర్, జనత న్యూస్ : కరీంనగర్‌లో ఈ నెల 19న జరగనున్న సర్పంచుల సమావేశానికి సంబంధించి పార్టీ కార్యాచరణను ఖరారు చేసేందుకు బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో సోమవారం కీలక సమావేశం నిర్వహించనున్నారు. చింతకుంటలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ సమావేశం జరుగుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో కరీంనగర్ జిల్లా ముఖ్య నాయకులు పాల్గొని, 19న కరీంనగర్‌లో నిర్వహించనున్న సర్పంచుల సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకు సంబంధించిన ఏర్పాట్లు, పార్టీ కార్యాచరణ ప్రణాళికపై చర్చించనున్నారు. సమావేశం అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు సంయుక్త ప్రెస్‌మీట్ నిర్వహించనున్నట్లు పార్టీ ప్రకటించింది. ఈ ప్రెస్‌మీట్‌లో మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ నేత రస్మై బాలకిషన్, వి. సతీష్ కుమార్, సుంకే అరవింద్ శంకర్, నరదాసు లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొని మీడియాతో మాట్లాడనున్నారు. ప్రెస్‌మీట్ అనంతరం భోజన కార్యక్రమం కూడా ఏర్పాటు చేసినట్లు జిల్లా పార్టీ అధ్యక్షుడు జి.వి. రామకృష్ణ రావు తెలిపారు.

## యాదగిరిగుట్టలో భక్తుల కోలాహలం

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది. హైదరాబాద్ సహా రాష్ట్రంలోనిఅబశ్రీశ్రీ పలు ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో.. యాదగిరిగుట్ట ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. అబశ్రీశ్రీకొండ కింద లక్ష్మీపుష్కరిణి, కల్యాణకట్ట, వ్రత మండపం.. కొండపైన బస్ బే, దర్శన, ప్రసాద క్యూలైన్లు, ప్రధానాలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడాయి. రద్దీ కారణంగా స్వామివారి ధర్మదర్శనానికి రెండు గంటలు, స్పెషల్ దర్శనానికి అరగంట సమయం పట్టింది. ఇక భక్తులు జరిపించిన పలు రకాల పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా ఆదివారం ఆలయానికి రూ.39,22,539 ఆదాయం వచ్చింది. అత్యధికంగా ప్రసాద విక్రయం ద్వారా రూ.16,1,580, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.6.89 లక్షలు, వీఐపీ దర్శనాల ద్వారా రూ.5.10 లక్షలు, బ్రేక్ దర్శనాలతో రూ.3,15,600 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

# ధర్మ స్వేచ్ఛకు అక్షర రూపం త్యాగమూర్తి గురు తెగ్ బహదూర్ జీ

### విశాల్ కీర్తన దివస్ ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్



కరీంనగర్: జనత న్యూస్: "భారతదేశ ధర్మ రక్షకుడూ ధర్మ స్వేచ్ఛకు అక్షర రూపమైన త్యాగమూర్తొ మొఘల్ నిరంకుశత్వానికి ఎదిరించి అలుపెరగని పోరాటం చేసిన వీరుడు గురు తెగ్ బహదూర్ జీ" అని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొనియాడారు. 350వ షహీద్ దివస్ సందర్భంగా శ్రీ గురు తెగ్ బహదూర్ మహారాజ్ విశాల్ కీర్తన దివస్‌లో భాగంగా కరీంనగర్‌లో నిర్వహించిన భారీ ర్యాలీలో బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో ఆయన గురు తెగ్ బహదూర్ జీ త్యాగాన్ని స్మరిస్తూ ఘనంగా నివాళులర్పించారు. గురు తెగ్ బహదూర్ అసలు పేరు త్యాగమల్ అని, మొఘలులకు వ్యతిరేకంగా జరిగిన యుద్ధాల్లో ఆయన చూపిన అసమాన ధైర్యసాహసాలకు ప్రజలు ఆయనను 'గురు తెగ్ బహదూర్ జీ'గా (ఖడ్గ వీరుడు) గౌరవించారని బండి సంజయ్ తెలిపారు. "ఈ రోజు మనం ఒక వ్యక్తిని కాదూ ఒక చరిత్రను, ఒక త్యాగాన్ని, ఒక ధర్మ శిఖరాన్ని స్మరిస్తున్నాం. తన మతం కోసం కాదూ ఇతరుల మత స్వేచ్ఛ కోసం తల నరికి ఇచ్చిన ఏకైక మహానుభావుడు గురు తెగ్ బహదూర్ జీ" అని అన్నారు. 1660ల కాలంలో బలవంతపు మత మార్పిడులు, హింస, అణచివేతలతో దేశం వణికిపోయిన సందర్భంలో, కశ్మీర్ పండితులు ఆనంద్‌పూర్ సాహిబ్‌కు వచ్చి తమ బాధలను గురు తెగ్ బహదూర్ జీకి విన్నవించుకున్నారని గుర్తుచేశారు. ఔరంగజేబు చేసిన అరాచకాలపై నిలబడి, "ధర్మం మారదూ తల తెగినా సరే" అని చెప్పిన గురు తెగ్ బహదూర్ జీ ధైర్యమే భారతదేశ ఆత్మ అని స్పష్టం చేశారు.

"ఒక తల పడిందొ కానీ లక్షల తలలు ఎత్తయ్యాయి. ఒక శరీరం పడిందొ కానీ దేశం నిలబడింది. అందుకే భారతదేశం ఆయనను 'హింద్ కి చాదర్ణగా గౌరవించింది" అని బండి సంజయ్ పేర్కొన్నారు. గురు తెగ్ బహదూర్ జీ త్యాగమే తరువాత ఖాల్సా పంత్‌కు పునాది అయిందని, అదే త్యాగం భారతదేశానికి ధర్మ స్వేచ్ఛను అందించిందని తెలిపారు. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉందని, అన్యాయం జరిగితే నిలబడే ధైర్యం, ధర్మం కోసం త్యాగానికి సిద్ధమయ్యే తత్వం అవసరమని ఆయన అన్నారు. "భయం ముందు లొంగవద్దొ అన్యాయం ముందు మౌనం పాటించవద్దొ ధర్మం కోసం ఒంటరిగా అయినా నిలబడండి" అనే సందేశమే గురు తెగ్ బహదూర్ జీ ఇచ్చిన శాశ్వత సందేశమని తెలిపారు.

గురు తెగ్ బహదూర్ వంటి త్యాగమూర్తుల రక్తంతోనే ఈ దేశం నిలబడిందని, వారి బాటలో నడుస్తూ ధర్మ రక్షణ, న్యాయం, భారతీయతను కాపాడటమే వారికి నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని బండి సంజయ్ కుమార్ పేర్కొన్నారు.

## సంక్రాంతి సెలవుల్లో దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



కరీంనగర్, జనత న్యూస్ : సంక్రాంతి పండుగల సందర్భంగా పట్టణ ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి సొంత ఊళ్లకు వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఈ సమయంలో దొంగతనాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సూచించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పండుగల సమయంలో ఇళ్లు ఖాళీగా ఉండటాన్ని ఆసరాగా చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ పోలీసులు పట్టణంలో గస్తీని పెంచడంతో పాటు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రజలు కూడా కొన్ని జాగ్రత్తలు పాటిస్తే దొంగతనాలను పూర్తిగా నివారించవచ్చని సూచించారు. ఊరెళ్లే ముందు సమీప పోలీస్ స్టేషన్‌లో తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని, అలా చేస్తే పెట్రోలింగ్ సిబ్బంది ఇంటిపై ప్రత్యేక నిఘా ఉంచుతారని తెలిపారు. అలాగే ఇరుగుపొరుగు వారితో సమన్వయం పెట్టుకుని ఇంటిపై కంటువేయాలని కోరారు. ఇంట్లో ఎక్కువ నగదు, బంగారం ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచాలని, బీరువా తాళాలను ఇంట్లో వదిలిపెట్టకుండా తీసుకెళ్లాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో ఊరెళ్తున్నట్లు పోస్టులు చేయకూడదని, ఇది నేరగాళ్లకు అవకాశం కల్పించినట్టవుతుందని హెచ్చరించారు. ఇంట్లో ఒక గదిలో లైట్ వేసి ఉంచడం, తాళం బయటకు కనిపించకుండా ఏర్పాటు చేయడం మంచిదని తెలిపారు. కాలనీలు, ఇళ్ల పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా చోరీలను అడ్డుకోవచ్చని పేర్కొన్నారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే పండుగ సమయంలో పెరిగే ఆన్‌లైన్ షాపింగ్ ఆఫర్ల పేరుతో సైబర్ మోసాలు జరుగుతున్నాయని, అపరిచిత లింకులు తెరవకూడదని, లాటరీలు, బహుమతుల పేరుతో వచ్చే సందేశాలను నమ్మవద్దని ప్రజలను హెచ్చరించారు. సైబర్ నేరానికి గురై డబ్బులు కోల్పోతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ అయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 112 లేదా 100కు కాల్ చేయాలని సూచించారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ అప్రమత్తంగా వ్యవహరిస్తే పండుగలను ప్రశాంతంగా జరుపుకోవచ్చని, సురక్షితమైన ప్రయాణం చేసి ఆనందంగా సంక్రాంతి వేడుకలు జరుపుకోవాలని కరీంనగర్ పోలీసులు కోరారు.

### పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి చేతుల మీదుగా

## వర్గల్ నవోదయ విద్యార్థులకు బహుమతులు

సిద్దిపేట, జనత న్యూస్ : సిద్దిపేట జిల్లా వర్గల్‌లోని జవహర్ నవోదయ విద్యాలయానికి చెందిన ఎనిమిది మంది విద్యార్థిని-విద్యార్థులు ఈ నెల 15వ తేదీన న్యూఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవల్ చేతుల మీదుగా బహుమతులను స్వీకరించనున్నట్లు విద్యాలయ ప్రిన్సిపల్ దాసి రాజేందర్ తెలిపారు. గత ఏడాది 2025 ఫిబ్రవరిలో మహారాష్ట్ర నాగపూర్ జిల్లాలోని జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించిన 26వ జాతీయ యువ పార్లమెంట్ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినందుకుగాను ఈ ఎనిమిది మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు ఆయన వివరించారు. ఆ పోటీల్లో విద్యార్థులు స్పీకర్, ప్రధానమంత్రి, మంత్రులు, ప్రతిపక్ష నేతలు వంటి కీలక పాత్రలు పోషించి తమ ప్రతిభను చాటుకున్నారని తెలిపారు. ఈ పోటీల్లో న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన మహారాష్ట్ర విధాన మండలి సభ్యుడు కృపాల్ తుమానే, నవోదయ విద్యాలయ సమితి పూణే ప్రాంతీయ కార్యాలయ అధికారి సంగీత, భారత ప్రభుత్వ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ డిప్యూటీ సెక్రటరీ ఏ.బి. ఆచార్య విద్యార్థుల ప్రదర్శనను ప్రశంసించా రని పేర్కొన్నారు. బహుమతుల స్వీకరణ కోసం ఈ నెల 13వ తేదీన విద్యార్థులు న్యూఢిల్లీకి ప్రయాణం కానున్నారని, ప్రిన్సిపల్ దాసి రాజేందర్‌తో పాటు సాంఘిక శాస్త్ర అధ్యాపకుడు జి.ఎస్.ఆర్. భాస్కర్, ఆంగ్ల అధ్యాపకురాలు సుసాన్ జాన్ ఎస్కార్ట్ టీచర్లుగా వ్యవహరించనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు విద్యార్థులను అభినందిస్తూ, ప్రాంతీయ స్థాయి పోటీల్లోనే వీరి ప్రతిభను గుర్తించానని, జాతీయ స్థాయిలో కూడా వీరు మరింత ఉన్నతంగా రాణిస్తారని తనకు అప్పుడే విశ్వాసం కలిగిందని అన్నారు. ఈ ఘన విజయం సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులు, నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ మోహన్ రాథోడ్, అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. భవిష్యత్తులో వీరు పరిణితి చెందిన నాయకులుగా ఎదిగి వికసిత్ భారత్--2047 లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని వారు ఆకాంక్షించారు.

## బెజ్జంకిలో దుర్గమ్మ తల్లి మారుపట్నం



జనత న్యూస్ బెజ్జంకి : మండల కేంద్రంలో పాపయ్యపల్లి కీ వెళ్లే మార్గంలో ప్రతిష్టాత్మకంగా పున ప్రతిష్ట చేసిన దుర్గమ్మ తల్లి జాతర మహోత్సవాన్ని గత వారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించుకున్నారు. అందులో భాగంగా ఆదివారం బెజ్జంకి మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య ఆధ్వర్యంలో దుర్గమ్మ తల్లి మారుపట్నం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి స్నేహితులకు, గ్రామస్తులకు భోజన కార్యక్రమాలు ఏర్పాటు చేసి గ్రామస్తులచే ప్రశంసలు అందుకున్నారు. పదవి లేకున్నా గ్రామంలో జరిగే ప్రతి సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటూ గ్రామ సేవ చేస్తున్నటువంటి మాజీ సర్పంచ్ రావుల నర్సయ్యను పలువురు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనరసింహస్వామి టెంపుల్ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్, గ్రామ ఉపసర్పంచ్ ధూమాల మహేష్ , గ్రామ యాదవ నాయకులు ఇస్కిల్ల ఐలయ్య ,సంఘు రమేష్ యాదవ్, మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com